# ప్రజా మారిటెల

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 07 | సంచిక : 21 | బుధవారం 16 - 09 - 2026 | పేజీలు : 04 | వెల రూ. 2





యూపీఐపై ఛార్జీలు విధిస్తే భారత్‌లో మళ్లీ క్యాష్ వినియోగం పెరుగుతుంది
'భారత్‌పే' సహ వ్యవస్థాపకుడు అష్నీర్ గ్రోవర్

## కొండా సురేఖ
# బర్తరఫ్ బాధాకరమే.. కానీ



- మహేశ్ గౌడ్ కీలక వ్యాఖ్యలు
- పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనతోనే ఏఐసీసీ చర్య తీసుకుందని వెల్లడి
- పార్టీ హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని స్పష్టీకరణ
- సీఎం రేవంత్‌రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని వ్యాఖ్య
- ప్రభుత్వం, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడి
- పార్టీ సమస్యలను అంతర్గత వేదికల్లోనే చర్చించాలని సూచన

**హైదరాబాద్ :**
కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడం బాధాకరమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అయితే పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకే ఏఐసీసీ ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. పార్టీ నిర్దేశించిన హద్దులు దాటితే ఎంతటివారిపైనైనా చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, ఇటీవలి పరిణామాలపై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. "పార్టీ క్రమశిక్షణే అత్యంత ప్రధానం. ఏఐసీసీ నిర్దేశించిన హద్దులు, పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపై చర్చించుకోవాలని సూచించారు. విషయాలను బహిరంగంగా మాట్లాడి క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం ఉపేక్షించదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డితో కలిసి ప్రజా సంక్షేమం విస్తరణ, తెలంగాణలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. తమ మధ్య గ్యాప్ ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే తెలంగాణలో - మిగతా 2 లో

## ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు
# ఓటమి ఖాయం



- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఉద్యోగులతో విభేదించిన ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి రాలేదని కవిత వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని విమర్శలు
- ఉద్యోగులు, ఉపాధ్యాయులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణ
- 630 మండలాలకు 8 మంది పర్మినెంట్ ఎంఈవోలే ఉన్నారని విమర్శ
- పీఆర్సీ, డీఏలపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపణ

## తెలంగాణ రౌడీ
# రాజ్యంలా మారింది



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నా పీఆర్ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు
- సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో ముసుగులు ధరించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్
- పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్

**హైదరాబాద్ :**
హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్ఓ మహేశ్ - మిగతా 2 లో

## దేశం నుంచి ఆశించడమే కాదు
# సేవ చేయండి



- జెన్ జెడ్, జెన్ ఆల్ఫాకు నిర్మల సీతారామన్
- దేశం కోసం ఏం చేయగలరో యువత ఆలోచించాలన్న నిర్మలా సీతారామన్
- యువత నాయకత్వం చేపట్టి దేశానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్న కేంద్రమంత్రి
- ప్రపంచ అనిశ్చితిలోనూ భారత్ 7.8 శాతం వృద్ధి సాధించిందని వ్యాఖ్య
- తమిళనాడులో గ్లోబల్ కంపెనీలతో ఉపాధి అవకాశాలు పుష్కలమన్న మంత్రి

**ఢిల్లీ :**
దేశం నుంచి మనం ఏం ఆశించాలనే దానికంటే, దేశానికి మనం ఏం చేయగలమనే అంశంపైనే యువత ప్రధానంగా దృష్టి సారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు. యువత ఆకాంక్షలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని, అయితే అదే సమయంలో వారు తమ పౌర బాధ్యతలను కూడా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆమె సూచించారు. మంగళవారం చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "యువత నాయకత్వం బాధ్యతలు చేపట్టాలి. దేశ హితానికే ప్రథమ - మిగతా 2 లో

## అంతరిక్షంలో
# అమెరికా ఆయుధాలు

- తొలిసారి బహిరంగ ప్రకటన
- కక్ష్యలో అమెరికా వద్ద ఆయుధాలు ఉన్నట్లు స్పేస్ ఫోర్స్ ప్రకటన
- వీటిని 'స్పేస్ కంట్రోల్ వెపన్స్'గా పేర్కొన్న అమెరికా
- చైనా, రష్యాలను ప్రధాన అంతరిక్ష ముప్పులుగా గుర్తిస్తున్న అమెరికా



2 లో

## కృత్రిమ సూర్యుడి దిశగా
# భారత్ కీలక ముందడుగు

- ఈ ప్రయోగం విజయవంతమైతే లాభాలివే!
- భారత్ 'కృత్రిమ సూర్యుడు' ప్రాజెక్టులో మరో కీలక ముందడుగు
- సూర్యుడి కేంద్రకం కన్నా అధిక ఉష్ణోగ్రతలను సాధించిన భారత ప్రయోగాలు
- అపరిమిత శక్తినిచ్చే ఫ్యూజన్ టెక్నాలజీపై పరిశోధనలు వేగవంతం



**ఢిల్లీ :**
అపరిమిత, స్వచ్ఛమైన ఇంధనాన్ని సృష్టించే లక్ష్యంతో భారత్ చేపట్టిన 'కృత్రిమ సూర్యుడు' పరిశోధనల్లో మరో కీలక ముందడుగు పడింది. గుజరాత్‌లోని 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్' (ఐపీఆర్) ఆధ్వర్యంలోని స్టడీ స్టేట్ - మిగతా 2 లో

# తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీ కానుక

- అదనంగా 5 లక్షల ఇళ్లు మంజూరు
- ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షల ఇళ్ల కేటాయింపు
- తెలంగాణకు 2 లక్షల ఇళ్లు
- ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రయోజనం
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులకు ఇళ్ల నిర్మాణానికి అవకాశం
- త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక

**ఢిల్లీ :**
ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద తెలుగు రాష్ట్రాలకు అదనంగా మరో 5 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటికే కేటాయించిన ఇళ్లకు అదనంగా ఈ ఇళ్లను అందించనుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు - మిగతా 2 లో



## ఆళ్ల నాని మృతి పట్ల
# జగన్ తీవ్ర దిగ్భ్రాంతి



- గుండెపోటుతో హఠాన్మరణం చెందిన ఆళ్ల నాని
- నాని మరణవార్త తనను కలచి వేసిందన్న జగన్
- ఆళ్ల నాని మృతి తీరని లోటు అన్న బొత్స సత్యనారాయణ

**అమరావతి :**
మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని (56) అకస్మాత్తుగా గుండెపోటుతో కన్నుమూయడంపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖపట్నంలోని తన నివాసంలో ఆళ్ల నాని హఠాన్మరణం చెందారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన తెలిపారు. నాని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ - మిగతా 2 లో

## స్థానిక ఎన్నికలకు
# వేగంగా అడుగులు



- ఈనెల 22న ఓటర్ల జాబితా
- ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగవంతం
- 41 పట్టణ స్థానిక సంస్థలకు ఓటర్ల జాబితాల రూపకల్పనకు ఆదేశాలు
- ఈ నెల 22న తుది ఓటర్ల జాబితాలను ప్రచురించనున్న ఎన్నికల సంఘం
- 2026 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎస్ఈసీ
- ఇటీవలే 59 మున్సిపాలిటీలకు కూడా ఇదే తరహా నోటిఫికేషన్ జారీ

**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తును వేగవంతం చేసింది. మున్సిపల్ ఎన్నికలను పూర్తి చేసే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా 41 పట్టణ స్థానిక సంస్థలకు ఫోటో ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. - మిగతా 2 లో

# 2029 నాటికి అర్హులందరికీ సొంతిల్లు

- గృహ నిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 2027 మార్చి నాటికి 5.52 లక్షల గృహాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశం
- ఉచిత ఇళ్ల స్థలాల కోసం పారదర్శక విధానం అమలు చేయాలని సూచన
- కేంద్ర సహకారంతో రాష్ట్రంలో పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక
- కుప్పం నియోజకవర్గంలో సంతృప్త స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్దేశం



**అమరావతి :**
రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన గృహాన్ని అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 'హౌసింగ్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని సాచురేషన్ విధానంలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు ఆ శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్), పీఎం జన్ - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఆహార నిర్వేదం



ఆరోగ్యకరమైన జీవనానికి ఆహారం అత్యంత ముఖ్యం. జీవులు ప్రాణాలు నిలుపుకోవ డానికి ఆహారం అవసరం. సరైన ఆహారం ఆరోగ్యాన్ని ఇస్తుంది. ఆహారం మితిమీరినప్పుడు, ఆహారంలో శుచి శుభ్రతలు లోపించినప్పుడు ఆరోగ్యం వికటించి నానా వ్యాధులూ కలుగుతాయి. 'ఆహార సంభవో వస్తుః రోగాస్త్వాహార సంభవాః' అని మన తొలి ఆయుర్వేద గ్రంథం 'చరక సంహిత' చెబుతోంది. ఆరోగ్యానికైనా, అనారోగ్యానికైనా ఆహారమే మూలమనే అవగాహన మనవాళ్లకు చరకుడి కాలం నుంచే ఉండేది. దాదాపు అదే కాలంలో పాశ్చాత్య ప్రపంచంలోనూ ఆహారంపై ఈ అవగాహ ఉండేది. 'మనం బతకడం కోసం తినాలి, తినడం కోసం బతకడం కాదు' అని రోమన్ తత్త్వవేత్త సిసిరో చెప్పాడు. ఆరోగ్య స్పృహతో ఆహారం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఎవరు ఎన్ని విధాలుగా చెప్పినా, జిహ్వాచాపల్యం మనిషికి గల నానా బలహీనతల్లో మొదటి వరుసలో ఉంటుంది. జిహ్వాచపలురను తిండిపోతులుగా జనాలు ఆడిపోసుకుంటారు గాని, వారు మాత్రం తమను తాము భోజనప్రియులుగా ప్రకటించుకుంటూ ఉంటారు. సుష్టుగా షడ్రసోపేతమైన భోజనాన్ని ఆరగించడాన్ని భోజనప్రియులు 'ఉదరపూజ'గా అభివర్ణి స్తారు. 'పొట్టతో వాదించడం చాలా కష్టం. దానికి చెవులు ఉండవు' అని గ్రీకు తత్త్వవేత్త ప్లూటార్క్ భోజనప్రియత్వాన్ని గురించే చమత్కరించాడు. నాగరికతలకు మునుపు మనుషులు కూడా మిగిలిన జంతుజాలం మాదిరిగానే దొరికినదేదో తింటూ బతికేవారు. ప్రపంచవ్యాప్తంగా నాగరికతలతో పాటు పాకకళ అభివృద్ధి చెందింది. పాకకళతో పాటు రుచులు మరిగిన నోటికి జిహ్వాచాపల్యం, భోజన ప్రియత్వం పెరుగుతూ వచ్చాయి. ఆరోగ్యానికైనా, అనారోగ్యానికైనా ఆహారమే మూల మనే సంగతి మనుషులకు అనుభవపూర్వంగా తెలిసివచ్చింది. ఆహార మహిమ బోధ పడిన తర్వాత ఆయుర్వేదం సహా రకరకాల ప్రాచీన వైద్యవిధానాలు అభివృద్ధి చెందాయి. ప్రపంచంలోని ప్రతి ప్రాంతానికీ ఒక ఆహార సంస్కృతి ఉంటుంది. ఆహార సంస్కృతి ఆ ప్రాంత అస్తిత్వంలో అవిభాజ్య భాగంగా ఉంటుంది. అందుకే ప్రపంచంలోని ఏ భాషకు చెందిన సాహిత్యంలోనైనా ఆహార వర్ణన కనిపిస్తుంది. తెలుగు సాహిత్యానికి సంబంధించి మన ఆహార వైవిధ్యాన్ని గ్రంథస్థం చేసిన పూర్వకవులలో శ్రీనాథుడు అగ్రగణ్యుడు. 'శృంగార నైషధం'లో శ్రీనాథుడు ఎన్నో వంటకాలను వర్ణించాడు. వేర్వేరు ప్రాంతాల్లో పర్యటించినప్పుడు రాసిన చాటువుల్లోనూ శ్రీనాథుడు ఆ ప్రాంతాల్లోని ఆహార వైవిధ్యాన్ని వర్ణించాడు. జిహ్వకు హితవైన వాటిని పొగిడాడు, నోటికి వెగటైన వాటిని వెటకరించాడు. తెలుగు కవులలో అన్నమాచార్యుడు, శ్రీకృష్ణదేవరాయలు, అల్లసాని పెద్దన వంటివారు కూడా తమ కవిత్వంలో ఆహార వైవిధ్యాన్ని, వైభవాన్ని కళ్లకు కట్టారు. భారతీయుల తొలి పాకశాస్త్ర గ్రంథం 'పాకదర్పణం'. దీని అసలు గ్రంథకర్త ఎవరో తెలీదు గాని, కర్తృత్వాన్ని పురాణ పురుషుడైన నల మహారాజుకు ఆపాదించారు. 'భుజ్యతే యేన యత్నేన/ తస్యారోగ్యం భవేద్ధ్రువమ్/ వాతజం పిత్తజం రోగం/ శ్లేష్మజం హన్తి సర్వదా' అని-- అంటే, ఇందులో వివరించిన ఆహార పదార్థాలను భుజించేవారికి వాత పిత్త కఫ జనిత రోగాలన్నీ నశిస్తాయని 'పాకదర్పణం' ఆత్మవిశ్వాసంతో చెబుతోంది. 'పాకదర్పణం' కేవలం వంటల పుస్తకం మాత్రమే కాదు, ఇది ఆరోగ్యశాస్త్ర గ్రంథం కూడా! ఆహార పదార్థాల్లోని షడ్రుచుల గురించి; భక్ష్య భోజ్య లేహ్య చోష్య పేయాది పంచభక్ష్యాల గురించి; అష్టవిధ ఆహార దోషాల గురించి; వంటచేసే పాచకునికి ఉండ వలసిన లక్షణాల గురించి; రుతువులకు అనుగుణంగా తీసుకోవలసిన ఆహార పదార్థాల గురించి విపులంగా వర్ణించిన గ్రంథమిది. ఆనాటి జనాలు ఆరోగ్యసూత్రాలను పాటిస్తూనే ఆహారాన్ని ఆస్వాదించేవారు. ఆహారకల్తీ బెడద ఉండేది కాదు. ఈనాటి జనాల్లో ఆరోగ్య స్పృహ పెరిగినా, బయట దొరికే ఆహార పదార్థాల్లో ఏవి కల్తీవో, ఏవి మంచివో గుర్తించలేని పరిస్థితి ఉంది. ప్యాకెట్లలో దొరికే ఆహార పదార్థాలలో ఆరోగ్యానికి చేటు కలిగించే చక్కెర, ఉప్పు, కొవ్వులు వంటి పదార్థాలు ఏమేరకు వాడుతున్నారో తెలియజెప్పే హెచ్చరిక లేబుల్స్‌ను తప్పనిసరిగా ముద్రించాలని భారత ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆహార తయారీ సంస్థలను ఆదేశించాల్సిన దుఃస్థితి దాపురించింది.

## స్థానిక ఎన్నికలకు వేగంగా అడుగులు

**మొదటిపేజీ తరువాయి -** ఈ నోటిఫికేషన్ పరిధిలో రాష్ట్రంలోని 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు మరియు నగర్ పంచాయతీలు ఉన్నాయి. ఈ సంస్థలన్నింటికీ ఓటర్ల జాబితాలను రూపొందించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఎస్ఈసీ ఆదేశించింది. అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన తాజా ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ఈ జాబితాలను తయారు చేయనున్నారు. 2026 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా ఎస్ఈసీ నిర్ణయించింది. ఈ తేదీ నాటికి ఓటు హక్కు పొందిన వారి పేర్లతో జాబితాలను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియను పూర్తి చేసి, తుది ఓటర్ల జాబితాలను ఈ నెల 22న ప్రచురించనున్నట్లు ఎన్నికల సంఘం తన నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొంది. ఇటీవలే మరో 59 మున్సిపాలిటీలలో ఓటర్ల జాబితాల తయారీకి కూడా ఎస్ఈసీ ఇదే తరహాలో నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా నోటిఫికేషన్‌తో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ మరింత వేగం పుంజుకుంది. వరుస నోటిఫికేషన్ల నేపథ్యంలో త్వరలోనే రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నగారా మోగనుందని స్పష్టమవుతోంది.

## ఆళ్ల నాని మృతి పట్ల జగన్ తీవ్ర దిగ్భ్రాంతి

**మొదటిపేజీ తరువాయి -** కష్టసమయంలో వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... ఆళ్ల నాని మరణవార్త విని తాను శోకసముద్రంలో మునిగిపోయానని, ఆయన మృతి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు కన్నబాబు, వెల్లంపల్లి శ్రీనివాసరావు ఆళ్ల నాని కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని ప్రకటిస్తూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. వైసీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆళ్ల నాని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశాఖపట్నంలో గుండెపోటుకు గురైన ఆళ్ల నానిని ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు విడిచారు. ఏలూరు నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన, గత వైసీపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా, వైద్యారోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సంగతి తెలిసిందే.

## కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమే.. కానీ



**మొదటిపేజీ తరువాయి -** పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సాధారణ కార్యకర్తలకు సైతం పార్టీలో కీలక పదవులు దక్కుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

# 2029 నాటికి అర్హులందరికీ సొంతిల్లు

**మొదటిపేజీ తరువాయి -** మన్ వంటి వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణ పనులను వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పట్టణ ప్రాంతాల్లో 1.5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. డిసెంబరు 2026 నాటికి 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారుల గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పీఎంఏవై 1.0, 2.0, పీఎం జన్ మన్ పథకాల కింద మొత్తం 18.72 లక్షల ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 13.20 లక్షలు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో 16.11 లక్షల ఇళ్లకు గాను 11.31 లక్షలు, ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లకు గాను 1.88 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. ఇంటి స్థలం లేని అర్హులైన కుటుంబాలను కచ్చితంగా గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖలతో



పాటు ఆర్టీజీఎస్ నుంచి డేటాను అనుసంధానం చేసి, డూప్లికేషన్ లేకుండా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రాథమిక జాబితాలు ప్రచురించి, అభ్యంతరాలు స్వీకరించి, పారదర్శకంగా పరిష్కరించిన తర్వాతే తుది జాబితాలను ఖరారు చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టని భూమిని అవసరాన్ని బట్టి 2 లేదా 3 సెంట్ల ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని నిర్దేశించారు. కుప్పం నియోజకవర్గంలో సాచురేషన్ విధానంలో గృహ నిర్మాణం చేపట్టాలని ప్రత్యేకంగా ఆదేశించారు. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పారిశ్రామిక టౌన్‌షిప్‌లను నిర్మించే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి గృహ నిర్మాణ శాఖను ఆదేశించారు. శ్రీసిటీ సహా ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ టౌన్‌షిప్‌ల ఏర్పాటు ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)తో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. 2027 డిసెంబరు నాటికి మరో 75 వేల కొత్త గృహాలు మంజూరయ్యేలా, 1.5 లక్షల ఇళ్లను పైప్‌లైన్‌లో ఉంచేలా చూడాలని, ఇందుకు అవసరమైన నిధుల కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

## దేశం నుంచి ఆశించడమే కాదు.. సేవ చేయండి

**మొదటిపేజీ తరువాయి -** ప్రాధాన్యతనివ్వాలి. దేశం సురక్షితంగా, పటిష్ఠంగా ఉన్నప్పుడే మనకు నివసించడానికి ఒక ప్రశాంతమైన ఆవాసం ఉంటుంది. మన మాతృభూమిని ఎన్నటికీ వదులుకోకూడదు" అని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న అశాంతి వంటి ప్రపంచ పరిణామాలను ప్రస్తావిస్తూ, దేశ భద్రత, స్థిరత్వం యొక్క ఆవశ్యకతను ఆమె ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని ఆమె కొనియాడారు. తమిళనాడు రాష్ట్రం పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో హబ్‌గా విరాజిల్లుతోందని, ముఖ్యంగా శ్రీపెరంబుదూర్-ఒరగడమ్ కారిడార్ ఆటోమొబైల్, స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల అంతర్జాతీయ కేంద్రంగా నిలుస్తోందని తెలిపారు. కోయంబత్తూరు, మధురై వంటి నగరాల్లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని ఆమె వివరించారు. ఉద్యోగినులను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రతి జిల్లాలో వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేసేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయించినట్లు ఆమె గుర్తుచేశారు. ఈ సందర్భంగా 'తిరుక్కురళ్'లోని సూక్తులను ఉటంకిస్తూ, పట్టభద్రులు అహంకారాన్ని వీడి వినయంతో మెలగాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆమె హితవు పలికారు.

## కృత్రిమ సూర్యుడి దిశగా భారత్ కీలక ముందడుగు

సూపర్ కండక్టింగ్ టోకామాక్-1 (ఎస్ఎస్టీ-1)లో అత్యంత శక్తిమంతమైన కొత్త గైరోట్రాన్ వ్యవస్థను విజయవంతంగా అనుసంధానించారు. ఈ పరిణామంతో ఫ్యూజన్ టెక్నాలజీపై జరుగుతున్న పరిశోధనలు మరింత వేగవంతం కానున్నాయి. ఎస్ఎస్టీ-1 అనేది డోనట్ ఆకారంలో ఉండే ఒక ప్రయోగాత్మక ఫ్యూజన్ రియాక్టర్. సూర్యుడిలో శక్తి పుట్టే ప్రక్రియను భూమిపై సృష్టించి, తద్వారా అపారమైన శక్తిని ఉత్పత్తి చేయడమే ఈ పరిశోధనల ముఖ్య ఉద్దేశం. ఈ ప్రక్రియలో అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద ఉండే ప్లాస్మాను నియంత్రించడం అత్యంత కీలకం. తాజాగా ఏర్పాటు చేసిన 82.6 గిగాహెర్ట్జ్, 400 కిలోవాట్ల సామర్థ్యం గల గైరోట్రాన్, ఈ ప్లాస్మాను వేడిచేయడానికి, నియంత్రించడానికి ఉపయోగపడుతుంది. ఇప్పటికే ఉన్న 42 గిగాహెర్ట్జ్, 500 కిలోవాట్ల వ్యవస్థతో కలిసి ఇది పనిచేయనుండటంతో శాస్త్రవేత్తలకు ప్రయోగాల్లో మరింత సౌలభ్యం లభించనుంది. సూర్యుడు తన గురుత్వాకర్షణ శక్తితో అత్యంత వేడి ప్లాస్మాను నియంత్రిస్తే, భూమిపై ఆ ప్రక్రియ కోసం శక్తిమంతమైన అయస్కాంత క్షేత్రాలను ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ ప్లాస్మాను స్థిరంగా, ఎక్కువసేపు నిలపడమే ప్రస్తుతం శాస్త్రవేత్తల ముందున్న అతిపెద్ద సవాలు. భారత శాస్త్రవేత్తలు ఇప్పటికే తమ ప్రయోగాల్లో సూర్యుడి కేంద్రకం కన్నా కొన్ని రెట్లు అధికంగా, అంటే దాదాపు 20 కోట్ల డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను సాధించి రికార్డు సృష్టించారు. అయితే, ఎస్ఎస్టీ-1 ప్రస్తుతం వాణిజ్యపరంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయదు. ఇది కేవలం పరిశోధనల కోసం మాత్రమే పనిచేస్తుంది. ఈ కొత్త గైరోట్రాన్ వ్యవస్థ ఏర్పాటుతో, అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద ప్లాస్మాను నియంత్రించడంపై మరింత లోతైన అధ్యయనం చేసేందుకు వీలు కలుగుతుంది. భవిష్యత్తులో ఫ్యూజన్ రియాక్టర్ల నిర్మాణానికి ఈ పరిశోధనలు మార్గం సుగమం చేయనున్నాయి.

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీ కానుక

**మొదటిపేజీ తరువాయి -** కేటాయించింది. ఈ నిర్ణయంతో రెండు రాష్ట్రాల్లోని ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత ఉన్న కుటుంబాలు సొంతింటి నిర్మాణానికి కేంద్రం అందించే సాయాన్ని పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద భారీగా ఇళ్లను కేటాయించిన కేంద్రం.. తాజాగా మరో 5 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపింది. కొత్త కేటాయింపులతో మరింత మంది నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరే అవకాశం ఉంది. త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అర్హతలు, ఎంపిక విధానం, లబ్ధిదారుల జాబితాకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించనున్నారు. అర్హత ఉన్న కుటుంబాలు ప్రభుత్వ ప్రకటనలపై దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

## అంతరిక్షంలో అమెరికా ఆయుధాలు



**మొదటిపేజీ తరువాయి -** అంతరిక్షంలో తమ వద్ద ఆయుధాలు ఉన్నాయని అమెరికా తొలిసారి బహిరంగంగా ప్రకటించింది. ఇప్పటికే కొన్ని 'స్పేస్ కంట్రోల్ వెపన్స్' కక్ష్యలో ఉన్నాయని అమెరికా స్పేస్ ఫోర్స్ వెల్లడించింది. శత్రు దేశాల దాడుల నుంచి అమెరికా, మిత్రదేశాల బలగాలను రక్షించేందుకే వీటిని మోహరించినట్లు తెలిపింది. అయితే ఆయుధాల సంఖ్య, వాటి స్థానం, ఏ తరహా వ్యవస్థలను ఉపయోగి స్తున్నారన్న వివరాలను మాత్రం వెల్లడించలేదు. అమెరికా ఎయిర్‌ఫోర్స్ కార్యదర్శి ట్రాయ్ మెయింక్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అమెరికా సాయుధ బలగాలపై శత్రు దేశాల నుంచి ఎదురయ్యే ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యాలను మరింత పెంచుతున్నామని చెప్పారు. ప్రస్తుతం కక్ష్యలోనే శత్రు చర్యలను ఎదుర్కోగల అంతరిక్ష ఆయుధాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ ఆయుధాలు 'కైనెటిక్, నాన్-కైనెటిక్' విధానాల్లో పనిచేయగలవని స్పేస్ ఫోర్స్ తెలిపింది. అవసరాన్ని బట్టి రక్షణతో పాటు దాడి చర్యల్లోనూ వీటిని ఉపయోగించవచ్చని పేర్కొంది. అయితే అవి ఉపగ్రహాలను ధ్వంసం చేసే ఆయుధాలా, ఇతర రకాల వ్యవస్థలా అన్నదానిపై స్పష్టత ఇవ్వలేదు. అంతరిక్ష రంగంలో చైనా, రష్యాల నుంచి ముప్పు పెరుగుతోందని అమెరికా భావిస్తోంది. ఉపగ్రహాలు సైనిక కమ్యూనికేషన్లు, నిఘా, నావిగేషన్‌కు కీలకం కావడంతో వాటిపై ఆధిపత్యం భవిష్యత్ యుద్ధాల్లో కీలకంగా మారనుంది. ఈ నేపథ్యంలో అమెరికా తొలిసారి కక్ష్యలో ఆయుధాల ఉనికిని బహిరంగంగా అంగీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. 1967 నాటి ఔటర్ స్పేస్ ట్రీటీ అంతరిక్షంలో సామూహిక విధ్వంసక ఆయుధాల మోహరింపును నిషేధిస్తుంది. అయితే అన్ని రకాల సంప్రదాయ సైనిక సామర్థ్యాలపై నిషేధం లేదు.

# ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు ఓటమి ఖాయం

**మొదటిపేజీ తరువాయి -** ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వారిని చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చూస్తామని కవిత చెప్పారు. ఉద్యోగులను గౌరవించేలా, వారు సంతోషంగా పనిచేసేలా తమ ప్రభుత్వం విధానాలు రూపొంది స్తుందని తెలిపారు. తెలంగాణ



ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం కన్నా ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చి పోరాడారని కవిత గుర్తు చేశారు. రాష్ట్రంలో 630 మండలాలకు కేవలం ఎనిమిది మంది పర్మినెంట్ మండల విద్యాధికారులు (ఎంఈవోలు) ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత, నాణ్యమైన విద్య అందాలంటే బలమైన యంత్రాంగం అవసరమని అన్నారు. విద్యార్థుల వివరాలు, రిపోర్టుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్న పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ఉద్యోగుల సహకారం లేకుండా ప్రభుత్వం ఏ కార్యక్రమాన్నీ సమర్థంగా అమలు చేయలేదని కవిత అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కూడా ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. మైకుల ముందు ఎన్ని గొప్పలు చెప్పినా పెన్షన్లు, యూరియా, రైతులకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు పీఆర్సీ, డీఏలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు వాటిపై స్పందించలేదని అన్నారు.

# తెలంగాణ రౌడీ రాజ్యంలా మారింది



**మొదటిపేజీ తరువాయి -** మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## 22ఏ భూముల సమస్య తీవ్ర రూపం దాల్చింది

**రఘునందన్ రావు**

**లక్షలాది మంది ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక ఇబ్బంది పడుతున్నారన్న రఘునందన్ రావు**

**అసెంబ్లీలో మంత్రి పొంగులేటి సమాధానం దాటవేశారని విమర్శ**

**కాంగ్రెస్ ప్రభుత్వం బురద చల్లే రాజకీయాలు చేస్తోందని మండిపాటు**



తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్య తీవ్ర రూపం దాల్చిందని, దీనివల్ల లక్షలాది మంది సామాన్య ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో 22ఏ భూములపై స్పష్టమైన చారిత్రాత్మక నిర్ణయం వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ అంశంపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కనీస సన్నాహాలు లేకుండా సభకు వచ్చి అరకొర సమాచారంతో సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కోటి ఎకరాలకు పైగా భూములను అడ్డగోలుగా 22ఏ జాబితాలో చేర్చిన అధికారులపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి ప్రతిపాదిస్తున్నట్లు, ఇప్పటివరకు తొలగించామంటున్న 47,440 ఎకరాల వివరాలు ఏ గ్రామంలో ఎక్కడున్నాయో బహిర్గతం చేయాలని, మిగిలిన భూములపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కూడిన ప్రత్యేక కమిటీని నియమించి ధరణి, భూభారతి లొసుగుల వల్ల నష్టపోయిన పేదలకు న్యాయం చేయాలని రఘునందన్ రావు కోరారు. ప్రజా సమస్యలపై నిలదీస్తే బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ రేవంత్ సర్కార్ బురదజల్లే రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మొదటి కేబినెట్ సమావేశంలోనే భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎంపీ స్పష్టం చేశారు.

# సీఎఫ్ఐ జాతీయ రోడ్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో అంబర్‌నగర్ బాలుడి ప్రతిభ



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 15 (ప్రజా మంటలు):** హైదరాబాద్ నాగోల్ వేదికగా నిర్వహించిన ప్రతిష్ఠాత్మక 1వ క్యాడెట్ నేషనల్ రోడ్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో అంబర్‌నగర్‌కు చెందిన రోనక్ అర్జున్ రెడ్డి విశేష ప్రతిభ కనబరిచాడు. సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీఎఫ్ఐ), డాక్టర్ మాక్స్‌వెల్ ట్రేవర్ సైక్లింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎంటీసీడబ్ల్యూఏ) సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న ఈ జాతీయ స్థాయి పోటీలను ఘనంగా నిర్వహించారు. 8 నుంచి 11 ఏళ్ల వయస్సు విభాగంలో బరిలోకి దిగిన అర్జున్ రెడ్డి, అత్యంత ఉత్సాహంతో పోటీపడి అందరి దృష్టినీ ఆకర్షించాడు. చిన్న వయసులోనే జాతీయ స్థాయి సైక్లింగ్ వేదికపై అడుగుపెట్టి సత్తా చాటడం పట్ల బాలుడి తల్లిదండ్రులు నవీన్ రెడ్డి, సంగీతా రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో అర్జున్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడనే నమ్మకం ఉందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంటీసీడబ్ల్యూఏ అధ్యక్షుడు డాక్టర్ మాక్స్‌వెల్ ట్రేవర్, ట్రెజరర్ లోరైన్ ట్రేవర్, జనరల్ సెక్రటరీ ఎం.కె. పాషా, వైస్ ప్రెసిడెంట్ శివకుశల్ తదితరులు మాట్లాడుతూ, క్రీడలు శారీరక ఆరోగ్యానికే కాకుండా క్రమశిక్షణతో కూడిన జీవన విధానానికి దోహదపడతాయని తెలిపారు. ప్రతి చిన్నారిలోనూ ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, తల్లిదండ్రులు పిల్లలను చిన్నతనం నుంచే ఆటల వైపు ప్రోత్సహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన అర్జున్ రెడ్డిని నిర్వాహకులు, సీఎఫ్ఐ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

# అంబాల భాగ్యవతి మృతి కోరుట్ల రాజకీయాలకు తీరని లోటు

## నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానానికి ముగింపు

## మాజీ మంత్రులు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తదితరుల సంతాపం



**కోరుట్ల సెప్టెంబర్ 15 (ప్రజా మంటలు);** కోరుట్ల ప్రాంత రాజకీయాల్లో దాదాపు నాలుగు దశాబ్దాల పాటు క్రియాశీలకంగా కొనసాగుతూ, తనకంటూ ప్రత్యేక రాజకీయ గుర్తింపు తెచ్చుకున్న అంబాల భాగ్యవతి మృతి తీవ్ర విషాదాన్ని నింపింది. ఆమె మరణం కోరుట్ల రాజకీయాలకు తీరని లోటని పలువురు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. అంబాల భాగ్యవతి కత్లాపూర్ మాజీ జెడ్పీటీసీగా, భూషణరావుపేట సర్పంచ్‌గా, మండలాధ్యక్షురాలిగా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే అంబాల రాజారాం కోడలిగా రాజకీయ కుటుంబంలోకి వచ్చిన ఆమె, స్వతంత్రంగా తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ స్థానిక రాజకీయాల్లో బలమైన నాయకురాలిగా ఎదిగారు. ప్రత్యేకంగా తెలుగుదేశం పార్టీ పాలనా కాలంలో అంబాల భాగ్యవతి రాజకీయంగా ప్రభావవంతమైన పాత్ర పోషించారు. గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలు, మహిళల భాగస్వామ్యం, స్థానిక సంస్థల వ్యవహారాల్లో చురుకైన పాత్ర వహిస్తూ ప్రజలతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. దాదాపు 40 సంవత్సరాల ఆమె రాజకీయ ప్రస్థానం కోరుట్ల ప్రాంత రాజకీయ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది. ఆమె మృతిపట్ల మాజీ మంత్రి జి. రాజేశం గౌడ్, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, తుల గంగవ్వ ట్రస్ట్ చైర్మన్ తుల రాజేందర్ తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం అంబాల భాగ్యవతి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంబాల భాగ్యవతి మృతి పట్ల వారు మాట్లాడుతూ, సుదీర్ఘకాలం రాజకీయాల్లో కొనసాగుతూ ప్రజా జీవితంలో తనదైన ముద్ర వేసిన ఆమె ఇక లేరనే వార్త బాధాకరమన్నారు. ఆమె సేవలను, రాజకీయ ప్రస్థానాన్ని స్మరించుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దాదాపు నాలుగు దశాబ్దాల ప్రజాజీవితంలో వివిధ పదవులు నిర్వహించిన అంబాల భాగ్యవతి మృతి స్థానిక రాజకీయ, సామాజిక రంగాలకు తీరని లోటని పలువురు పేర్కొన్నారు.

# మాజీ సర్పంచ్ గడ్డం గంగారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన తుల ఉమ-రాజేందర్ దంపతులు



**జగిత్యాల సెప్టెంబర్ 15 (ప్రజా మంటలు):జగిత్యాల:** జగిత్యాల మండలం నర్సింగాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ గడ్డం గంగారెడ్డి నిన్న పరమపదించారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ--రాజేందర్ దంపతులు నర్సింగాపూర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గంగారెడ్డి మృతికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసిన తుల ఉమ--రాజేందర్ దంపతులు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గ్రామ సర్పంచ్‌గా గడ్డం గంగారెడ్డి అందించిన సేవలను వారు ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

# ధారం శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు



**కరీంనగర్ సెప్టెంబర్ 15 (ప్రజా మంటలు):** కరీంనగర్: కరీంనగర్ జిల్లా ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు ధారం శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం కరీంనగర్‌లోని టీఎన్జీవోల సంఘం భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, పెండింగ్ బిల్లులు, తదితర అంశాలపై ధారం శ్రీనివాస్ రెడ్డి చేస్తున్న కృషిని నాయకులు అభినందించారు. ఉద్యోగుల హక్కుల సాధన, సంక్షేమం కోసం ఆయన నాయకత్వంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణ్‌రావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపెల్లి కాళీచరణ్, కార్యదర్శి ఎడ్ల అరవింద్ రెడ్డి, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డితో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# పద్మారావునగర్‌లో ఘనంగా శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవాలు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 15 (ప్రజా మంటలు):** సికింద్రాబాద్ పద్మారావునగర్ సాయిబాబా దేవాలయం సమీపంలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు గణనాథుడికి నిత్యం ప్రత్యేక పూజలు చేస్తూ అత్యంత భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేపట్టి అన్నదాన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఈ ఉత్సవాల నిర్వహణలో అసోసియేషన్ సభ్యులు శ్రీకాంత్, సైనేష్, హేమంత్, శ్రీను, రాహుల్, సాయి రోహిత్, వెంకట్ సతీష్, దీపక్, అజయ్, శివ, జ్ఞాని, సాయి వర్ధన్, శశాంక్, సూర్య, వంశీ, అభి, గౌతమ్, నాగార్జున, శ్రీశాంక్, నానిలతో పాటు ఇతర సభ్యులంతా చురుగ్గా పాల్గొని విజయవంతం చేస్తున్నారు. కాలనీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు.

# గాంధీ సూపరింటెండెంట్‌ను కలిసిన చిలకలగూడ ఇన్స్పెక్టర్



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 15 (ప్రజా మంటలు):** సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ టి. ఉషారాణిని మంగళవారం చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ, సెక్టార్ ఎస్సై రాకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆసుపత్రి పరిసరాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, రోగులు, వారి బంధువుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై వారు ప్రత్యేకంగా చర్చించారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచుతామని, వైద్య సిబ్బందికి, రోగులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తామని ఈ సందర్భంగా పోలీస్ అధికారులు స్పష్టం చేశారు.

# అలూమ్ని అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ జి.ఆర్. లింగమూర్తి




**సికింద్రాబాద్, సెప్టెంబర్ 15 (ప్రజా మంటలు):** సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజ్ అలూమ్ని అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ జి.ఆర్. లింగమూర్తి మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనరల్ బాడీ సమావేశంలో సభ్యులు ఆయనను వచ్చే రెండేళ్లకు అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. గత నాలుగేళ్లుగా అసోసియేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టానని, మూడోసారి తనను ఎన్నుకున్న సభ్యులకు లింగమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

# గిరిజన రిజర్వేషన్ల పెంపు కేసీఆర్ ఘనత - జీవన్ రెడ్డి



**జగిత్యాల, సెప్టెంబర్ 15 (ప్రజా మంటలు):** గిరిజనుల రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 17న ప్రతి తండా, గూడెంలో కేసీఆర్‌కు క్షీరాభిషేకం చేయాలని పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల హక్కుల రక్షణ కోసం కేసీఆర్ రిజర్వేషన్లు పెంచడంతో పాటు తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారని, గురుకుల పాఠశాలలు, ప్రత్యేక నిధులతో గిరిజనుల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో దాడులు జరుగుతున్నాయని ఆరోపించిన జీవన్ రెడ్డి, పోలీస్ స్టేషన్‌లో జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ పీఆర్వో అరెస్టు, పోలీస్ స్టేషన్‌లో దాడి ఘటనను కుట్రపూరిత చర్యగా అభివర్ణించారు. దావ వసంత సురేష్ మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో గిరిజనుల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టారని, ప్రస్తుత ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాలరాస్తూ బడ్జెట్‌ను కాగితాలకే పరిమితం చేస్తోందని విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రజలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే హైదరాబాద్ దిగ్బంధనం



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ప్రజా మంటలు):** ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ఈ నెల 18లోగా నెరవేర్చాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే హైదరాబాద్ దిగ్బంధనానికి ఉద్యోగ సంఘాలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. మాట తప్పడం, మడమ తిప్పడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్రేడ్‌మార్క్‌గా మారిందని విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ఉద్యోగులను బెదిరించడం సరికాదని, వారు ప్రభుత్వానికి బానిసలు కాదని అన్నారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీ, పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, హెల్త్ కార్డుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2003లో నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ఉద్యోగ సంఘాలు ప్రభుత్వం ముందుంచిన 37 డిమాండ్లలో చాలా వరకు ఆర్థిక భారం లేనివేనని కవిత పేర్కొన్నారు. 18లోగా సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యోగ సంఘాల పోరాటానికి టీఆర్ఎస్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా, పెన్షనర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, టీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి శ్రీనివాస్, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ విశ్వ కర్మ భగవానుని సామూహిక వ్రతం



**గొల్లపల్లి సెప్టెంబర్ 12 ప్రజా మంటలు :** గొల్లపల్లి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ భవనంలో మంగళవారం శ్రీ విశ్వకర్మ భగవానుని సామూహిక వ్రతం నిర్వహించారు, మహిళలు అధిక సంఖ్యలో మంగళహారతులతో భగవానుని వ్రత కార్యక్రమం లో పాల్గొన్నారు తదనంతరం సంఘ భవనంలో మహా అన్న ప్రసాదము నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, మూలవిరట్టైన విశ్వకర్మ భగవానుని ఎంతో గొప్పగా కొనియాడారు లోక కళ్యాణం కోసం చేసినటువంటి ఇట్టి వ్రతం ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాడిపంటలతో సిరిసంపదతో ఉండాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాజ గణేష్ జిల్లా అధ్యక్షులు టీవీ సత్యం, మండల అధ్యక్షులు బలభక్తుల కిషన్, సంకోజి రమణ, కోరుకుంటూ రాము, కుమార్, సజ్జనపు రవి, శ్రీకోటి నీలకంఠం, కరుణాకర్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హింగే భాస్కర్‌కు నాగూర్ల వెంకటేశ్వర్లు ఘన సత్కారం



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 15 ప్రజా మంటలు :** వ్యవసాయ రంగంలో అదుకున్న రైతు నాయకులు హింగే భాస్కర్ను తెలంగాణ ఫర్టిలైజర్ అండ్ సీడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగూర్ల వెంకటేశ్వర్లు ఘనంగా సత్కరించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న హింగే భాస్కర్ సేవలను గుర్తించి స్వర్ణ నంది పురస్కారం అందుకోవడం పట్ల నాగూర్ల వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. రైతుల కోసం అంకితభావంతో పనిచేస్తున్న వారికి ఇలాంటి పురస్కారాలు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా నాగూర్ల వెంకటేశ్వర్లు గారు తన నివాసంలో హింగే భాస్కర్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ రైతుల సంక్షేమం కోసం మరింతగా సేవలందించాలని ఆకాంక్షించారు. రైతుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, రైతులకు అవసరమైన సూచనలు, సహకారం అందిస్తూ హింగే భాస్కర్ చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. రైతు సంక్షేమం కోసం పనిచేసే నాయకులను గుర్తించి గౌరవించడం ద్వారా మరింత మంది రైతు సేవా కార్యక్రమాల వైపు ముందుకు రావడానికి స్ఫూర్తి లభిస్తుందని అన్నారు.

# విభిన్న అవతారాల్లో గణనాథుడు దర్శించిన అదువాల జ్యోతి లక్ష్మణ్



**జగిత్యాల, సెప్టెంబర్ 15 (ప్రజా మంటలు):** జగిత్యాల పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ గణేష్ మండళ్ల ఆధ్వర్యంలో గణనాథుడిని అయ్యప్ప స్వామి, నరసింహస్వామి, కాశీ విశ్వనాథుడు, శ్రీకాళహస్తి పాతాళ గణపతి అవతారాల్లో అలంకరించి భక్తులను ఆకట్టుకుంటున్నారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అదువాల జ్యోతి లక్ష్మణ్ ఆయా మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగిత్యాల ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవ నిర్వాహకులను అభినందించారు.

# ఎల్కతుర్తి సీఐ శ్రీనివాస్‌కు మాజీ సర్పంచుల సన్మానం



**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 15 (ప్రజా మంటలు):** ఎల్కతుర్తి నూతన సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కే. శ్రీనివాస్‌ను పలువురు మాజీ సర్పంచులు, బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన సీఐ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, ఎల్కతుర్తి ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఆయన చేపట్టే చర్యలకు సహకరిస్తామని వారు తెలిపారు. సీఐను కలిసిన వారిలో భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కుడుతాడి చిరంజీవి, పల్లెపాటి మధుకర్, నాయకులు సుకినే సుధాకర్ రావు, తక్కళ్లపల్లి సంపత్ రావు, హింగే దేవరావు, విద్యాసాగర్ ఉన్నారు. అలాగే మాజీ సర్పంచులు బూర్గుల రామారావు, నిరంజన్ రెడ్డి, సురేష్ రెడ్డి, భాస్కర్ రావు, ప్రసాద్ తదితరులు పాల్గొని సీఐ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణకు పద్మశాలి సేవా సంఘం పిలుపు

## మట్టి గణపతినే పూజిద్దాం.. ముద్దు రంగుల గణపతిని వద్దనుకుందాం



**గొల్లపల్లి, సెప్టెంబర్ 15 (ప్రజా మంటలు):** పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రతి సంవత్సరం మట్టి గణపతిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న గొల్లపల్లి పట్టణ పద్మశాలి సేవా సంఘం నిర్ణయాన్ని పలువురు అభినందిస్తున్నారు. గొల్లపల్లి మండల కేంద్రంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలను ప్రారంభం నుంచే మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహంతో నిర్వహిస్తున్నారు. పర్యావరణానికి హాని కలిగించే రంగులు, రసాయనాలతో తయారయ్యే విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి గణపతిని పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నది సంఘం ప్రధాన ఉద్దేశంగా పేర్కొంది.

**ఎత్తులో కాదు.. భక్తిలో పోటీ :** వినాయక చవితి ఉత్సవాల్లో విగ్రహాల ఎత్తుపై పోటీ పడటం కంటే భక్తి, ఆధ్యాత్మికత, సామాజిక బాధ్యతలో పోటీ పడాలని పద్మశాలి సేవా సంఘం సందేశం ఇస్తోంది. మట్టి గణపతిని నిష్ఠతో పూజించడం ద్వారా విఘ్నాలు తొలగి విజయాలు సిద్ధిస్తాయనే విశ్వాసంతో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. "ముద్దు రంగుల గణపతి వద్దు.. మట్టి గణపతే ముద్దు" అనే సందేశంతో పర్యావరణహితమైన వినాయక చవితిని నిర్వహించడం ద్వారా భక్తితో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరుతున్నారు. పద్మశాలి సేవా సంఘం తీసుకున్న ఈ నిర్ణయం పర్యావరణ పరిరక్షణకు దోహదపడటమే కాకుండా ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రైవేటు కోచింగ్ సెంటర్లపై చంద్రబాబు సీరియస్- కఠిన చర్యలకు ఆదేశం

## జీవో నెం.9 నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని వెల్లడి

## రాజకీయ కుట్రల్లో భాగస్వాములను చేస్తే సహించేది లేదని స్పష్టీకరణ

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్న ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వంపై బురదజల్లే లక్ష్యంతో విద్యార్థులను ఆందోళనలకు ఉసిగొల్పుతున్నారని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే సంస్థలపై చట్టప్రకారం ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాల యాజమాన్యాలు తమ స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. పోటీ పరీక్షల కోసం తమ వద్ద శిక్షణ పొందుతున్న యువతపై ఒత్తిడి తెచ్చి, వారిని రాజకీయ ప్రేరేపిత నిరసనలు, ధర్నాలలో పాల్గొనేలా చేస్తున్నట్లు తేలిందని అధికారులు పేర్కొన్నారు. దురుద్దేశంతోనే అభ్యర్థులను ఈ ఆందోళనల వైపు మళ్లిస్తున్నారని ముఖ్యమంత్రికి వివరించారు. వాస్తవానికి, ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026, జీవో నెంబర్ 9 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు నిర్దేశిత మార్గదర్శకాలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. అయితే, ఈ నిబంధనలను పక్కనపెట్టి కొన్ని సంస్థలు రాజకీయ కార్యకలాపాలు నడుపుతున్నాయని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, అభ్యర్థులను రాజకీయ కుట్రల్లోకి లాగాలని చూస్తే కఠిన పరిణామాలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఏ కోచింగ్ సెంటర్‌పైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంలో వెనుకాడేది లేదని స్పష్టం చేసింది.

# కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే సూపర్ హిట్

**'పర్మినెంట్' సొల్యూషన్‌గా చూస్తున్న జీహెచ్ఎంసీ!**

**కేబీఆర్ పార్క్ చుట్టూ పోలీసులు వన్ వే విధానాన్ని అమలు చేస్తున్నారు**

**ఈ విధానం సత్ఫలితాలనిస్తుండటంతో వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం అవసరమా అని జీహెచ్ఎంసీ పునరాలోచనలో పడింది.**



కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు చేపట్టిన హెచ్-సిటీ ప్రాజెక్టు పనులపై జీహెచ్ఎంసీ పునరాలోచిస్తోంది. సుమారు రూ.1000 కోట్లతో ఏడు అండర్ పాస్‌లు, ఏడు స్టీల్ ఫ్లై ఓవర్లు నిర్మించేందుకు పనులు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకు పార్క్ చుట్టూ వన్-వే విధానాన్ని అమలు పరిచింది. అనూహ్యంగా ఈ విధానం సత్ఫలితాలను ఇస్తుండటంతో రూ.కోట్లాది ప్రజాధనం వృథా చేయడం కంటే వన్ వే విధానాన్నే శాశ్వతంగా (పర్మినెంట్) అమలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఇంజినీరింగ్ విభాగంతో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రత్యేకంగా సమీక్ష చేసినట్లు తెలుస్తోంది.కేబీఆర్ పార్క్ చుట్టూ తెలంగాణ ప్రభుత్వం రూ.1,090 కోట్ల అంచనా వ్యయంతో ఫ్లై ఓవర్, అండర్‌పాస్ పనులను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో వన్-వే ట్రాఫిక్ అమల్లోకి రావడం పరిస్థితిని పూర్తిగా మార్చేసింది. దీంతో వాహనాలు ఎక్కడా ఆగకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందుకు సాగుతుండటంతో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం అవసరమా అనే అంశంపై అధికారుల మధ్య విస్తృతంగా చర్చ మొదలైంది.పార్క్ చుట్టూ ప్రధానంగా 6 జంక్షన్లు ఉన్నాయి. కేబీఆర్ పార్క్ వైపు వెళ్లే ప్రతి వాహనాన్ని గడియారం తిరిగినట్లుగా మళ్లించడం ద్వారా వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడం లేదు. గతంలో వాహనదారులు ప్రతి జంక్షన్ వద్ద కనీసం 10 నుంచి 20 నిమిషాల పాటు ఆగాల్సి వచ్చేది. పైగా ఇలా కనీసం రెండు జంక్షన్లను దాటాల్సి వచ్చేది.వన్-వే విధానం వల్ల కేవలం 15 నుంచి 20 నిమిషాల్లోనే వాహనాలు కేబీఆర్ పార్క్ మొత్తాన్ని చుట్టేయగలుగుతున్నాయి. రహదారులను గుంతలు లేకుండా చేస్తే రాకపోకల్లో మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వన్-వే విధానాన్ని మరో నెల రోజుల పాటు పరిశీలించిన తర్వాత దీన్ని శాశ్వతం చేయడం వల్ల ప్రాజెక్ట్ ఖర్చులను భారీ స్థాయిలో తగ్గించవచ్చని భావిస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. ఈ మేరకు జీహెచ్ఎంసీలోని ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌తో చర్చలు ప్రారంభించారు.ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి ముందు నుంచి కేబీఆర్ పార్క్ జంక్షన్ వరకు ఉన్న మార్గంలో పిల్లర్ల నిర్మాణం ఇప్పటికే కాంట్రాక్టర్ ప్రారంభించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ పిల్లర్ల పునాదుల పనులు కూడా పూర్తి చేశారు. మహారాజ అగ్రసేన్ జంక్షన్, బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సమీపంలో అండర్ పాస్ నిర్మాణానికి పెద్ద ఎత్తున రోడ్డును తవ్వడం పూర్తి చేశారు. ఈ పరిస్థితుల్లో తదుపరి చర్యల విషయంలో జీహెచ్ఎంసీ అధికారులు ఏం చేయాలనే విషయంలో మదనపడుతున్నట్లు సమాచారం. మొదట్లో జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్క్ జంక్షన్, జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45, మహారాజ అగ్రసేన్ జంక్షన్ ప్రాంతాల్లో ఫ్లైఓవర్ లేదా అండర్ పాస్ నిర్మించాలని ప్రణాళికలు రూపొందించారు. ఇప్పుడు వాటిని రద్దు చేసే అవకాశం కూడా లేకపోలేదు.ప్రస్తుతం కేబీఆర్ పార్క్ చుట్టూ మొత్తం 13 రకాల పనులు జరుగుతున్నాయి. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ వద్ద మూడు పనులు (రెండు ఫ్లైఓవర్లు , ఒక అండర్‌పాస్), అలాగే మిగిలిన ఆరు జంక్షన్లలో ప్రతిచోటా ఒక అండర్‌పాస్, ఒక ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ప్రారంభించారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 3ను ఆదర్శ్‌నగర్‌తో కనెక్ట్ చేస్తూ ముగ్ధ క్రాస్‌రోడ్స్ వద్ద ప్రతిపాదించిన అండర్‌పాస్ కూడా ఈ ప్రాజెక్టులో భాగం చేశారు. మొత్తమ్మీద ఈ ప్రణాళికలో ఏడు జంక్షన్లు, 14 పనులు ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రతిపాదన ప్రకారం కేవలం నాలుగు జంక్షన్ల వద్ద మాత్రమే నిర్మాణ పనులు చేపట్టాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు భావిస్తున్నారు.

# ఏపీపై ద్రోణి, ఆవర్తన ప్రభావం మోస్తరు వర్షాలు

**వాయువ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా నైరుతి బంగాళాఖాతం వరకు ద్రోణి విస్తరించి ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు.రాష్ట్రంలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.**



వాయువ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా నైరుతి బంగాళాఖాతం వరకు ద్రోణి విస్తరించి ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. దీంతోపాటు ఒడిశా- పశ్చిమబెంగాల్ తీరాల మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొన్నారు. వీటి ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కోస్తా జిల్లాలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. మిగతా జిల్లాల్లోనూ చెదురు మదురుగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్లలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో అడపాదడపా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం వినాయక చవితి పందిళ్ల వద్ద ఇబ్బందికర పరిస్థితులను సృష్టించినప్పటికీ, భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ముందుగానే తగిన ఏర్పాట్లు చేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ పరిసర గ్రామాల్లో కూడా భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన ఈ వర్షం కారణంగా రోడ్లపై నీరు నిలిచిపోయింది. వినాయక చవితి పందిళ్లలోని విగ్రహాలు తడవకుండా ఉండేందుకు నిర్వాహకులు వాటిని టార్పాలిన్లతో కప్పారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ వర్షం పత్తి, మిరప, వరి - మొక్కజొన్న వంటి పంటలకు మేలు చేసింది.నైరుతి రుతుపవనాల ఉపసంహరణకు సూచన: ఈ నెల 19న నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈశాన్య రాజస్థాన్ - ఉత్తర గుజరాత్ ప్రాంతాలపై అల్పపీడనం కొనసాగుతుండగా, ఒడిశా - పశ్చిమ బెంగాల్ ప్రాంతాలపై 1.5 నుంచి 5.6 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం ఏర్పడింది. అదనంగా రుతుపవన ద్రోణి నైరుతి బంగాళాఖాతం, కర్ణాటక - తమిళనాడు ప్రాంతాలపై ప్రభావం చూపుతోంది.

# ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం ఎలైన్‌మెంట్‌ను పెండింగ్ పెట్టిన కేంద్రం

**ఆర్ఆర్ఆర్ విషయంలో కేంద్రం వెనక్కి తగ్గింది**

**ఆర్ఆర్ఆర్ దక్షిణ భగం ఎలైన్‌మెంట్ ప్రాజెక్టును ఏ పథకంలోనూ చేర్చని కారణంతో పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం.**

**ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం ఎలైన్‌మెంట్ పెండింగ్**



ఆర్ఆర్ఆర్ విషయంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏ పథకంలోనూ చేర్చనందున ఆర్ఆర్ఆర్ దక్షిణ భగం ఎలైన్‌మెంట్ ప్రాజెక్టు మంజూరును కేంద్రం పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. భారత మాల పరియోజన కింద ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులను ఎన్‌హెచ్ఏఐ చేపడుతోంది. ఈ నేపథ్యంలోనే దక్షిణ భాగం పనులను కూడా ఏదో ఒక పథకంలో చేర్చాల్సి ఉంటుంది. రాష్ట్రం ప్రభుత్వం సిద్ధం చేసిన ఎలైన్‌మెంట్‌ను మోర్త్‌కు సమర్పించారు. దానినే ఉత్తర భాగం పనులతో సమాంతరంగా పనులు చేపట్టాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది.నిజానికి ఉత్తర భాగం పొడవు 161.51 కిలోమీటర్లు కాగా, దక్షిణ భాగం పొడవు 201 కిలోమీటర్లుగా ఉంది. దీంతో ప్రాజెక్టు మొత్తం పొవు 362.51 కిలోమీటర్ల మేర ఏర్పాటు కావాల్సి ఉంది. అయితే దీనికి సంబంధించిన దక్షిణ భాగం ఎలైన్‌మెంట్‌పై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఇటీవల ఆర్ అండ్ బీ అధికారులు రాసిన ఓ లేఖకు మోర్త్ అధికారులు సమాచారం ఇచ్చారు. దీంతో ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాల పనులు సమాంతరంగా కొనసాగడం కాస్త అనుమానంగా కనిపిస్తోంది.ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి గతంలో డీపీఆర్ సమర్పించింది. దీనిలో ప్రాజెక్టు ఫ్యూచర్‌సిటీ మీదుగా ఎలైన్‌మెంట్ అయి ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని తంగడ్‌పల్లి నుంచి సంగారెడ్డి వరకు మొత్తం 201 కిలోమీటర్ల రహదారిని రూపొందించింది. ఈ మార్గం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేగా 6 వరుసలతో రూపొందించింది. జాతీయ రహదారులు-65, 44, 163, 19, 76లను ఈ ప్రాజెక్టు కలుపుతోంది.సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, యాదాద్రి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో మొత్తం 55 నివాసం ప్రాంతాల మీదుగా ఈ రహదారి వెళుతోంది. రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసిన ఈ ప్రాజెక్టుకు మొత్తం 2,010 హెక్టార్ల భూసేకరణ అవసరమని గుర్తించింది. ఈ వివరాలతో రూపొందించిన ఎలైన్‌మెంట్‌ను ప్రస్తుతం కేంద్రం పెండింగ్‌లో పెట్టింది.రీజినల్ రింగ్ రోడ్డు పూర్తయితే రవాణా వ్యవస్థ మెరుగుపడటమే కాకుండా, రాజధాని శివారు జిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధికి భారీ అవకాశాలు లభించనున్నాయి. ఇది తెలంగాణ అభివృద్ధికి నిజమైన 'గేమ్ ఛేంజర్'గా నిలుస్తుంది. ఉత్తర, దక్షిణ భాగాల అనుసంధానంతో హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాలు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులను పొందుతాయి. ఈ ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో నిరంతరం సమన్వయం చేసుకోవాల్సి ఉంది.కేంద్ర ప్రభుత్వం చేపట్టే రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం పనులకు సమాంతరంగా దక్షిణ భాగం పనులను చేపట్టే విధంగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉత్తర భాగంలో నాలుగు లైన్ల రహదారికి సంబంధించి గతంలోనే టెండర్లు పిలిచారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు లైన్లకు విస్తరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈ రిపోర్ట్‌కు కేంద్ర కేబినెట్ గతంలో ఆమోదం తెలిపింది. అయితే దక్షిణ భాగం పనులను కూడా ఏదో ఒక పథకంలో చేర్చకపోవడంతో ఆర్ఆర్ఆర్ దక్షిణ ఎలైన్‌మెంట్‌పై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది.

# 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ సంస్థదే

**సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురు**

**శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్, తెలంగాణ ప్రభుత్వం మధ్యలో వివాదస్పదంగా మారిన భూమిపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది**

**ఈ భూమి వ్యవహారంలోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ కేసు నమోదైన సంగతి తెలిసిందే.**



శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. హైదరాబాద్‌లోని 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ సంస్థకే చెందుతుందని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్‌కు వ్యతిరేకంగా తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్‌ను ఈ మేరకు సుప్రీంకోర్టు కొట్టేసింది.హైకోర్టు తీర్పును సకాలంలో సవాలు చేయలేదన్న సుప్రీంకోర్టు తగిన సమయంలో దాఖలు చేయకపోవడంతో విచారణకు తీసుకోలేమని స్పష్టం చేసింది. దీంతో జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. సికింద్రాబాద్ ప్రాంతంలో వివాదాస్పద భూమి ప్రైవేటు(శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్) వారికి చెందినదే అని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌లో శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ కేవియట్ దాఖలు చేసింది. ఈ భూమి వ్యవహారంలోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ కేసు నమోదైన సంగతి తెలిసిందే.

# రాజమహేంద్రవరానికి త్వరలో మరో బైపాస్

**నగరంలో తగ్గనున్న ట్రాఫిక్ రద్దీ**

**రాజమహేంద్రవరం నగరానికి త్వరలో మరో బైపాస్ రోడ్డు రానుంది**

**సిటీలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు బైపాస్ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది**

**గోదావరి పుష్కరాల దృష్ట్యా రద్దీని తగ్గించేందుకు ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది.**




రాజమహేంద్రవరం నగరానికి త్వరలో మరో బైపాస్ రోడ్డు రానుంది. సిటీలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు బైపాస్ నిర్మించాలని ప్రభుత్వం తలపెట్టింది. గోదావరి పుష్కరాల దృష్ట్యా రద్దీని తగ్గించేందుకు ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ మార్గం అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం తగ్గించడం సహా భారీ వాహనాలు సిటీలోకి రాకుండా నివారించవచ్చు.రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం దిశగా ప్రభుత్వం మరో ప్రణాళిక సిద్ధం చేసింది. వచ్చే ఏడాది జూన్‌లో జరిగే గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని మరో బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. బైపాస్ నిర్మాణానికి ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి ఎప్పటి నుంచో వినతులు వస్తున్న నేపథ్యంలో పుష్కరాల దృష్ట్యా విస్తృతంగా చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారులు దీనిపై కసరత్తు చేసి రాజమహేంద్రవరానికి బైపాస్ నిర్మాణం కోసం డీపీఆర్ సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారు.జాతీయ రహదారి రాజమహేంద్రవరం నగరం మీదుగా వెళ్తుండటంతో సిటీలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని అధికారులు కేంద్రానికి పంపిన నివేదికలో తెలిపారు. రాజానగరం నియోజకవర్గంలోని తొర్రేడు నుంచి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని పొట్టిలంక వరకు దాదాపు 32 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మించాలని నిర్ణయించారు.తొర్రేడు, బొబ్బిల్లంక, మధురపూడి, గాడాల, పాలచర్ల, దివాన్ చెరువు, పుణ్యక్షేత్రం, సంపత్ నగర్, కొండ గుంటూరు, చైతన్య నగర్, పొట్టిలంక మీదుగా బైపాస్ నిర్మించి, హైవేతో అనుసంధానం చేస్తారు. ఈ మేరకు ప్రణాళిక రూపొందించి ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపారు. నేషనల్ హైవే అథారిటీ ద్వారా ఈ బైపాస్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కేంద్రంతో చర్చించి త్వరలో బైపాస్ నిర్మాణానికి చర్యలు చేపడతామని ప్రజాప్రతినిధులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు."రాజమహేంద్రవరం బైపాస్ నిర్మాణానికి దాదాపుగా 300 కోట్లు అవుతుంది. గోదావరి పుష్కరాల దృష్ట్యా బైపాస్ నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. తొర్రేడు నుంచి పొట్టిలంక వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టనుంది. ఇందుకుగానూ డీపీఆర్ సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. బైపాస్ రోడ్డు అందుబాటులోకి వస్తే నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది.భారీ వాహనాలు సిటీలోకి రాకుండా కట్టడి: బైపాస్ వస్తే నగరంలో ట్రాఫిక్ గణనీయంగా తగ్గుతుంది. కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి చీఎ-16పై వెళ్లే భారీ వాహనాలను సిటీ బయట నుంచే మళ్లించవచ్చు. లారీలు, కంటైనర్లు, అంతర్రాష్ట్ర సరకు రవాణా వాహనాలు నగరంలోకి రాకుండా చేయవచ్చు. ఈ బైపాస్ ద్వారా నగర శివారులో వేగంగా అభివృద్ధి సాధ్యమవుతుంది.

# రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

**ప్రభుత్వ ఉద్యోగ నియామకాల గరిష్ఠ వయోపరిమితి పెంపు**

**ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు గరిష్ట వయోపరిమితిని వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రెండు వేర్వేరు ఉత్తర్వులను జారీ చేసింది**

**ఏపీపీఎస్సీ ఇతర నియామక సంస్థలు చేపట్టే నియామకాలకు వర్తిస్తుంది.**




రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఆశిస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఉద్యోగ నియామకాలకు సంబంధించి గరిష్ట వయోపరిమితిని పెంపుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు గరిష్ట వయోపరిమితి పెంపుదల చేసింది. ఈ మేరకు 187 ,188 జీవోలను రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ విడుదల చేసింది. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకూ ఈ గరిష్ట వయోపరిమితి పెంపుదల అమల్లో ఉంటుందని వెల్లడించింది.రాష్ట్రంలో సహా ఇతర రిక్రూటింగ్ ఏజెన్సీలు చేసే నియామక ప్రక్రియలకు ఈ వయోపరిమితి పెంపుదల అమలు కానుంది. ఈసారి యూనిఫాం సర్వీసులకు సర్వీసులకు రెండేళ్లపాటు సాధారణ కేటగిరీలో వయోపరిమితి సడలించారు. మిగిలిన రిక్రూట్ మెంట్‌లకు 34 ఏళ్ల గరిష్ట వయో పరిమితి నుంచి 44 ఏళ్లకు పెంచారు. రిజర్వ్‌డ్ కేటగిరీలకు మిగిలిన వాటికి వాటి సడలింపులు తథంగా వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.లక్షల మంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వయసు దాటిపోవడం తీవ్ర ఆవేదన గురిచేసిందని. దీనిపై పలువురు ప్రజాప్రతినిధులు, ఉపముఖ్యమంత్రి, మానవ వనరుల శాఖ మంత్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు వివరించింది.

# 'అలయ్ బలయ్'కి రండి.. చంద్రబాబును కలిసి ఆహ్వానించిన దత్తన్న

**హైదరాబాద్‌లో సీఎం చంద్రబాబుతో బండారు దత్తాత్రేయ భేటీ**

**'అలయ్ బలయ్' వేడుకలకు ముఖ్య అతిథిగా రావాలని ప్రత్యేక ఆహ్వానం**

**వేడుకకు తప్పకుండా హాజరవుతానని స్పష్టం చేసిన చంద్రబాబు**

**రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సంబంధాలు, సహకారంపై నేతల చర్చ**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో మర్యాదపూర్వకంగా జరిగిన ఈ భేటీలో, అక్టోబర్ 22న నిర్వహించే ప్రతిష్ఠాత్మక 'అలయ్ బలయ్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని చంద్రబాబును దత్తాత్రేయ ప్రత్యేకంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని, ఆత్మీయతను చాటుతున్న 'అలయ్ బలయ్' విశిష్టతను చంద్రబాబుకు వివరించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. దత్తాత్రేయ ఆహ్వానం పట్ల చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. వేడుకకు తప్పకుండా హాజరవుతానని తెలిపారు. దత్తాత్రేయ మాట్లాడుతూ, "అలయ్-బలయ్ వేదిక తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు మరియు సమాజంలోని వివిధ వర్గాల మధ్య సోదరభావాన్ని పెంపొందించే వేదిక" అని పేర్కొన్నారు.ఈ సమావేశంలో కేవలం ఆహ్వానం మాత్రమే కాకుండా, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సంబంధాల బలోపేతంపైనా ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించుకున్నారు. ఉభయ రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణం, ఉమ్మడి ప్రయోజనాలు, తెలుగు ప్రజల ఐక్యత, పరస్పర సహకారం వంటి కీలక అంశాలు వీరి మధ్య చర్చకు వచ్చాయి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com